# అధ్వానంగా వెంకన్న పుష్కరిణి

- చెత్త, నాచుతో నిండిన కోనేరు
- ఉపమాకపై టీటీడీ చిన్నచూపు



నాచు, చెత్తతో అధ్వానంగా ఉన్న ఉపమాక వెంకన్న పుష్కరిణి

**నక్కపల్లి:** భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఉపమాక వేంకటేశ్వరస్వామి పుష్కరిణి అధ్వానంగా తయారైంది. కోనేరు నాచు, చెత్తతో నిండిపోయింది. ముందుగా పుష్కరిణిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకోవాలని ఆశపడ్డ భక్తులు నిరాశ చెందుతున్నారు. 9 ఏళ్ల క్రితం ఉపమాకను ఆ.దీనంలోకి తీసుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఇక్కడి అభివృద్ధిపై చిన్నచూపు చూస్తోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దత్తత తీసుకునే సమయంలో కోట్లాది రూపాయలతో భక్తుల కోసం పలు అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించిన టీటీడీ.. తర్వాత ఏదో మొక్కుబడిగా కొంత మేర మాత్రమే అభివృద్ధి చేశారు. మొదటి నుంచి స్వామివారి పుష్కరిణిని ఆధునికీకరించి పవిత్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత భక్తులు కోరుతూనే ఉన్నారు. కానీ టీటీడీ మాత్రం పుష్కరిణి పవిత్రతను కాపాడేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన ఆరో శతాబ్దానికి చెందిన ఈ ఆలయానికి ఉత్తర ముఖంగా స్వామివారి పుష్కరిణి(బందుర సరస్సు) ఉంది. ఒకప్పుడు వెంకన్న దర్శనానికి వచ్చే భక్తులు ఈ పుష్కరిణిలో దిగి నీళ్ల నెత్తిన చల్లుకుని సంప్రోక్షణ చేసుకునే వారని చెబుతారు. ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు వచ్చే ఇతర ప్రాంతాల భక్తులు ఈ పుష్కరిణిలో స్నానమాచరించిన తర్వాతే స్వామిని దర్శించుకోవడం ఇప్పటికీ ఆనవాయితీగా వస్తోంది. స్వామివారి ఆలయంలో తీర్థం కోసం ఈ జలాలనే తీసుకెళ్లేవారు. అయితే కాలక్రమంలో పుష్కరిణిలో నాచు, చెత్తతో నిండిపోవడంతో అర్చకులు కూడా ఇటీవల ఈ పుష్కరిణిలో నీటిని తీర్థం కోసం ఉపయోగించడానికి ఇష్టపడటం లేదు. పుష్కరిణికి నాలుగు వైపులా నాచు, చెత్త భారీగా పేరుకుపోవడంతో నీటి నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో పుష్కరిణిని అభివృద్ధి చేయాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి స్థానిక నాయకులు విన్నవించుకోగా.. ఆయన స్పందించి టీటీడీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సుమారు రూ.50 లక్షలకు పైగా నిధులతో పుష్కరిణి చుట్టూ రాతికట్టు నిర్మించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అంతటితోనే పనులు ఆపేశారు. అసలు పని మాత్రం చేపట్టలేదు. పుష్కరిణిలో ఉన్న నీటిని తోడేసి, పూడిక తీసి, నాచు తొలగించి శుభ్రం చేయాలి. తరువాత పవిత్రంగా ఉండేలా పూర్తి స్థాయి రక్షణ చర్యలు చేపట్టాలి. అటువంటి చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు కూడా ఇష్టానుసారం కోనేరులో మునిగి వాటర్ బాటిళ్లను, దుస్తులను వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో పవిత్రంగా ఉండాల్సిన పుష్కరిణి అపవిత్రంగా తయారవుతోందన్న వాదన వినిపిస్తోంది.

### 3 నుంచి బ్రహ్మోత్సవాలు

వచ్చే నెల 3వ తేదీ నుంచి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తిరుమలలో మాదిరిగానే ఇక్కడ కూడా తొమ్మిది రోజుల పాటు అత్యంత ఘనంగా స్వామివారి తిరువీధి సేవలు, బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానమాచరించాలని ఆశపడతారు. పుష్కరిణి మాత్రం ప్రస్తుతం చాలా అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి పుష్కరిణిని పవిత్రతను కాపాడుతూ తక్షణమే కోనేరులో పేరుకుపోయిన నాచు, చెత్తను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

## వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు 'బూడి'కి అభినందనలు



ముత్యాలనాయుడును అభినందిస్తున్న అచ్యుతాపురం మండల వైఎస్సార్‌సీపీ నేతలు

**అచ్యుతాపురం(మునగపాక):** వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఆదివారం అచ్యుతాపురం మండలం వైఎస్సార్‌సీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో అందరి సమన్వయంతో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని ముందుకు తీసుకెళ్తానన్నారు. బూడిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేశంశెట్టి శంకరరావు, ఎంపీపీ కోన సంధ్య భర్త బుజ్జి, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, పార్టీ నేతలు పిన్నమరాజు వాసు, మారిశెట్టి సూర్యనారాయణ, వడిశెల శ్రీనివాసరావు, ఎర్రవరం సర్పంచ్ గంగిరెడ్డి రాము, తదితరులున్నారు.

## క్లుప్తంగా

### కోటవురట్ల మండల సర్వసభ్య సమావేశం నేడు

**కోటవురట్ల:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. వివిధ అభివృద్ధి పనులపై శాఖల వారీ సమీక్ష ఉంటుందని తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి రాట మహోత్సవం



వాడ్రాపల్లిలో రాట వేస్తున్న భక్తులు

**మునగపాక:** మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం దుర్గాదేవి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వేప చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. వాడ్రాపల్లి చిన రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, మళ్ల జోగినాయుడు, మహిళలు పాల్గొన్నారు.

### చదువుతో పాటు కళలపై దృష్టి సారించాలి



గీసిన పెయింటింగ్స్‌తో విద్యార్థులు

**మునగపాక:** మండలంలోని పాటిపల్లి మా ఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో విద్యార్థి అనే అంశంపై ఆదివారం విద్యార్థులు పెయింటింగ్స్ వేశారు. గుజరాత్‌లోని భావనగర్‌లో నిర్వహిస్తున్న రెయిన్ బో ఆర్ట్స్ అకాడమీ పెయింటింగ్స్ పోటీలకు ఈ పెయింటింగ్స్‌ను పంపనున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కళలు దోహదపడతాయని డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రామచంద్రరావు తెలిపారు. గ్రంథాలయం డైరెక్టర్ భీశెట్టి తులసీ మాట్లాడుతూ మా ఊళ్లో గ్రంథాలయం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకునేందుకు అవసరమయ్యే శిక్షణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

### పర్తియాత్ర విజయవంతం చేయండి



సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

**మాడుగుల:** సాయి మహిమను తెలుసుకోవాలని సత్యసాయి జిల్లా సేవా సమితి అధ్యక్షుడు అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక సాయి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. వచ్చే నెల 23, 24, 25 తేదీల్లో అనకాపల్లిలో ప్రశాంతి పర్తి యాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సాయి భక్తులు రాజుకొండ, శ్రీను, పుట్టా బలరామ్ పాల్గొన్నారు.

### 3 నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు



కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

**మాడుగుల రూరల్:** కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి శరనవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 12వ తేదీ వరకు ఉదయం నుంచి అష్టలక్ష్మి కుంకుమ పూజలు, అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. దాతలు విరాళాలు అందించాలని కోరారు.

## అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్న 1982-83 టెన్త్ బ్యాచ్ విద్యార్థినులు, టీచర్లు

**యలమంచిలి రూరల్:** వారంతా 42 ఏళ్ల క్రితం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదివారు. అనంతరం వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారంతా ఆదివారం చదువుకున్న స్కూల్ ఆవరణలో ఆత్మీయంగా కలుసుకున్నారు. 1982-83 టెన్త్ బ్యాచ్‌లో 70 మంది విద్యార్థినులు ఉండగా.. వారిలో 38 మంది వరకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందడం విశేషం. ఆత్మీయ సమావేశానికి హాజరై వారు చదువుకునే రోజులను, చిన్ననాటి సంఘటనలను గుర్తు తెచ్చుకుని భావోద్వేగానికి లోనయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువుల్లో అందుబాటులో ఉన్న వారిని సమావేశానికి పిలిచి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అప్పటి గురువులు సావిత్రి, సరోజినీ, అరుణకుమారి, పెదలక్ష్మీకాంతం టీచర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు కె.మంజువాణి, రాజేశ్వరి, వై.మేరీజ్యోతి, ఎం.దేవి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

### గణనాథుని సన్నిధిలో అన్నసమారాధన



మునగపాకలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

**మునగపాక:** మునగపాకలోని సంతబయిల పురాతన వినాయక ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ మందపాటి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు యలమంచిలి మున్సిపల్ సమావేశం

- రెండున్నర నెలల తర్వాత నిర్వహణ
- పట్టణంలో కుంటుపడిన పాలన
- సమస్యలతో ప్రజలు సతమతం



యలమంచిలి మున్సిపల్ కార్యాలయం

**యలమంచిలి రూరల్:** యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. చివరి సారిగా ఈ ఏడాది జూలై 12న కౌన్సిల్ సమావేశం జరిగింది. అప్పట్నుంచి రెండున్నర నెలలకు పైగా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. వాస్తవానికి ప్రతి నెలా కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉన్నా.. వివిధ కారణాలతో నిర్వహించలేదు. దీంతో పురపాలన కుంటుపడింది. పౌర సేవలు సకాలంలో అందడం లేదు. ఫిర్యాదులు, దరఖాస్తులను పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ సమస్య, వీధి దీపాల ఏర్పాటు, జనన, మరణ ధ్రువ పత్రాలు, ఆస్తి పన్ను పేరు మార్పు, చెత్త సేకరణ, ఇలా వివిధ పౌర సేవలకు సంబంధించి సిటిజన్ ఛార్టర్ అమలు కావడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర్నుంచి పురపాలక సంఘం కార్యాలయంలో పౌర సేవల దరఖాస్తులు ఎక్కడికక్కడ పేరుకుపోయినా వాటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారన్న విమర్శలున్నాయి. మరో వైపు పట్టణంతో పాటు శివారు గ్రామాల్లో వీధి కుక్కలు, కోతులు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మరో వైపు దోమల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం, వాటి నివారణ చర్యలు సక్రమంగా చేపట్టకపోవడంతో పట్టణ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. సోమవారం జరగనున్న సమావేశం అజెండా ఇప్పటికే వార్డు కౌన్సిలర్లకు అధికారులు పంపించారు. అయితే ప్రజలెదుర్కొంటున్న సమస్యలు చర్చకు వస్తాయో? లేదో? చూడాలి.

## 40 ఏళ్ల తరువాత కలుసుకున్నారు..



గురువులను సత్కరిస్తున్న కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

**కోటవురట్ల:** నలభై ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు ఒక్కటై ఆత్మీయంగా సమ్మేళనమయ్యారు. ఆనాటి మధురస్మృతులను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవిత విలువలను అందించిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గొట్టివాడ శివారున ఉన్న గెస్ట్ హౌస్ వేదికగా కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, ఎక్కడెక్కడో స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ గురువులు చైనులు, బి.ఎస్.ఎన్.మూర్తిలను ఘనంగా సత్కరించి ప్రణమిల్లారు. ఇటీవల మృతి చెందిన ఓ మిత్రుడికి శ్రద్ధాంజలి ఘటించారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**యలమంచిలి రూరల్:** దార్లపూడి 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఏటికొప్పాక 11 కేవీ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం సోమవారం మండలంలోని ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి సోమవారం ఉదయం 4 నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

## ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



ఊరేగింపులో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవరసిద్ధి వినాయకుడు



కుమ్మర వీధి గణపతి ఊరేగింపులో కోలాటం ప్రదర్శిస్తున్న రామచంద్రపురం చిన్నారులు



గణపతి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న జగ్గంపేట చిన్నారులు

**ఎస్.రాయవరం:** మండలంలో కొరుప్రోలు కుమ్మరి వీధిలో శ్రీవరసిద్ధి వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కోటవురట్ల మండలం రామచంద్రపురం, తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన చిన్నారుల కోలాటం ప్రదర్శన అలరించింది. నక్కపల్లి మండలం వేంపాడుకు చెందిన తప్పెటగుళ్లు, యలమంచిలి బృందం సన్నాయి మేళం నడుమ గణపతి ఊరేగింపు కనుల పండువగా జరిగింది. ఈ ఊరేగింపు కార్యక్రమం ఎస్.రాయవరం పోలీసుల సహాయ సహకారాలతో విజయవంతంగా సాగింది.

## నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

**కొద్ది నిమిషాలు గడిస్తే ఓ తండ్రి కూతురును చూసేవాడు. మరో వ్యక్తి తన గమ్యాన్ని చేరేవాడు. అంతలోనే మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చి కబళించింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రావణాపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు.**



రోడ్డు కిందకు పోయిన కారు



మరణించిన రాజుబాబు

- రావణాపల్లి వద్ద బైక్‌ను ఢీకొన్న కారు
- ఇద్దరి దుర్మరణం
- కూతురి దగ్గరకు వెళ్లకుండానే తండ్రి తిరిగిరాని లోకాలకు ..



ప్రమాద స్థలంలో అప్పన్న స్వామి



అప్పన్న స్వామి (ఫైల్)



రాజుబాబు (ఫైల్)

**కొయ్యూరు:** రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కూతురు రేష్మాను ఇంటికి తీసుకువచ్చేందుకు రాజేంద్రపాలెంకు చెందిన అంబటి అప్పన్న స్వామి(38) ఆదివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ ఎరకంపేటకు చెందిన యాదగిరి రాజుబాబు(58) కూడా అక్కడ వరకు వస్తానని స్వామి బైక్ ఎక్కాడు. రావణాపల్లి సమీపంలో రేగడివీధి జంక్షన్ వరకు బాగానే వెళ్లారు. కొద్ది నిమిషాల్లో రావణాపల్లి వెళ్తారనగా కృష్ణదేవిపేట నుంచి అతి వేగంగా వచ్చిన కారు చింతాలమ్మ గుడికి ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ వెనుక సీటుపై ఉన్న రాజుబాబు సుమారు పది మీటర్ల దూరంలో పడి మృతి చెందాడు. తీవ్ర గాయాలైన స్వామికి కృష్ణదేవిపేట ఆస్పత్రిలో చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. చింతాలమ్మ గుడికి వెళ్లేందుకు కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఒకరు గాయపడడంతో నర్సీపట్నం తరలించారు.

**కన్నీరుమున్నీరుగా..:** మరణించిన అంబటి స్వామి ఇక్కడ వైస్ ఎంపీపీ అంబటి నూకాలుకు స్వయాన సోదరుడు. స్వామికి భార్య దేవి, కూతురు రేష్మా, కొడుకులు సుశాంత్,లక్ష్మీతేజ ఉన్నారు. తండ్రి మరణ వార్త విన్న వారంతా తీవ్రంగా రోదించారు. స్వామి గతంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇప్పుడు వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వామి మరణించడంతో తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు. ప్రమాదంలో మరణించిన రాజుబాబు ఏజెన్సీ ప్రాంతంలో కోళ్లను కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఆదివారం కొయ్యూరు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. నిర్లక్ష్యంగా కారు నడిపి ఇద్దరి మరణానికి కారణమైన డ్రైవర్ రమణను కొయ్యూరు పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీ విజేత కేజేపురం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



పోటీల్లో దౌడు తీస్తున్న ఎడ్లబండి

**చీడికాడ:** జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీల్లో విజేతగా మాడుగుల మండలం కేజేపురం గ్రామానికి చెందిన ఆంజనేయ ఎడ్లబండి నిలిచింది. మండలంలోని దిబ్బపాలెంలో వరసిద్ధి వినాయకుని నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో ద్వితీయ స్థానం అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన మరిడిమాంబ బండి, తృతీయ స్థానం నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ, చతుర్థ స్థానం ముమ్మిన కనకరాజు, పంచమి స్థానం ఎం.కొత్తపల్లికి చెందిన నంబరు రామకృష్ణ బండి దక్కించుకున్నాయి. వీరికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున వైఎస్సార్‌సీపీ నేతలు, మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నందారపు రమణబాబు, కమిటీ సభ్యులు ప్రదానం చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

## గిరిజనులకు నిత్యావసర సరకుల పంపిణీ



గిరిజనులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సత్యసాయి భక్తులు

**దేవరాపల్లి:** భగవాన్ సత్య సాయిబాబా భక్తులు మారుమూల గిరిజనులకు ఆదివారం నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. వెంపలనగర్ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి గల్లా శంకరరావు ఆధ్వర్యంలో అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ పరిధిలో మాకనాపల్లికి చెందిన 27 గిరిజన కుటుంబాలకు వీటిని అందజేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎటూ వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు నెలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో వేచలపు రామునాయుడు, రంకిరెడ్డి వెంకటేశ్వర్లు, సూర రామారావు, లెక్కల సత్యనారాయణ, వేచలపు వెంకటరమణమూర్తి తదితర సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

### వారం రోజుల్లో ఇద్దరు శిశువుల మృతి

**జి.మాడుగుల:** జిల్లాలో మాతా శిశు మరణాలు ఆగడం లేదు. అనారోగ్యం తదితర కారణాలతో మృత్యువాతపడుతున్నా రు. మండలంలో బొయి తిలి పంచాయతీ పులుసుమామిడి గ్రామంలో వారం రోజుల వ్యవధిలో అనా రోగ్యంతో ఇద్దరు శిశువులు మృతిచెందారు. ఈ నెల 22న తోటపల్లి లక్ష్మీపతికి కుమార్తె (4 నెలలు) మృతి చెందగా, ఆదివారం తరడా రమేష్‌కు కుమారుడు (3నెలలు) మరణించినట్టు గ్రామస్తులు తెలి పారు. వరుసగా శిశు మరణాలు సంభవిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు, వైద్యశాఖ అధికార్లు వెంటనే స్పందించి శిశు మరణాలను నివారించాలని సర్పంచ్ మాలన్న, గ్రామస్తులు కోరారు.

### క్రీడల్లో బాలికల సత్తా



విజేతలతో పీడీ అచ్యుతరావు

**కోటవురట్ల:** పాములవాక కిల్లాడ రామ్మూర్తినాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో సత్తా చాటారు. ఈ మేరకు విజేతలను ఆదివారం హెచ్ఎం లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అండర్- 14 బాలికల విభాగం ఖోఖోలో ఎల్.లిఖితమణి, కె.జాహ్నవి, 600 మీటర్ల పరుగు పందెంలో ఎల్.లిఖితమణి తృతీయ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.రేష్మ, అండర్ -17 బాలికల విభాగం ఖోఖోలో కె.కాశీఅన్నపూర్ణ, ఎల్.వెంకటి, బ్యాడ్మింటన్‌లో ఎస్.దుర్గాభవానీ, 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.దుర్గాభవానీ ద్వితీయ స్థానం సాధించారు. వీరంతా జిల్లా స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించారని పీడీ అచ్యుతరావు తెలిపారు.

### మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

**మాడుగుల:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు వీధి పండుగలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో తాగునీరు తదితర సదుపాయాలు ఏర్పాటు చేశారు.